క్లుప్తంగా

ఇస్కాన్‌లో మార్మోగిన హరినామస్మరణ



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది : హరే కృష్ణ, హరే రామ అంటూ సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో హరినామ స్మరణ ఆదివారం మార్మోగింది. వారాంతపు పూజలు సందర్భంగా ఇస్కాన్ అధ్యక్షులు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీత శ్లోకాలు, ప్రవచనాలు ఆలపించారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

తైక్వాండో పోటీల్లో ప్రతిభ



జ్ఞాన సరస్వతి

పద్మనాభం : రాష్ట్ర స్థాయి అండర్ - 14 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తైక్వాండో బాల బాలికల పోటీల్లో మద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరో తరగతి విద్యార్థిని మొదిన జ్ఞాన సరస్వతి ప్రతిభ చూపి సిల్వర్ మెడల్ సాధించింది. బాపట్ల జిల్లా తెనాలి మండలం పేపేరులో ఈ నెల 10 నుంచి 12 వరకు నిర్వహించిన పోటీల్లో జ్ఞాన సరస్వతి పాల్గొని మెడల్ సాధించింది. జ్ఞాన సరస్వతికి హెచ్ఎం శాంతి ప్రసూన, పీడీ సర్పవు సూర్యనారాయణ, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

దీపావళి విశిష్టతపై ప్రచారం



భగవద్గీత గ్రంథాలు పంపిణీ చేస్తున్న త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు

పద్మనాభం : మండలంలోని మద్ది గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ సభ్యులు దీపావళి విశిష్టతపై ఆదివారం ప్రచారం చేశారు. దీపావళి రోజున ఇంటి లోపల, వెలుపల దీపాలు వెలిగించాలని సూచించారు. మనం నివసించే ఇంటిని మానవ శరీరంతో పోల్చుకోవాలని.., ఇంటిలో దీపాలు వెలిగిస్తే జ్ఞానికి గుర్తు అని, ఇంటి వెలుపల దీపాలు వెలిగించడం పరమాత్మ శక్తికి గుర్తు అని తెలియజేశారు. ఈ సందర్భంగా భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, సభ్యులు బి.భవాని, కె.లక్ష్మి, అచ్చయ్యమ్మ పాల్గొన్నారు.

జనావాసాల మధ్యే చెట్ల కొమ్మలు



శ్రీనివాసనగర్‌లో ఇటీవల వర్షాలకు విరిగిన చెట్ల కొమ్మలు

తగరపువలస : ఇటీవల వర్షాలకు జీవీఎంసీ మధురవాడ జోన్ కొమ్మాది శ్రీనివాసనగర్‌లో చెట్లు, చెట్ల కొమ్మలు విరిగి ఇళ్ల మధ్య అధ్వానంగా కనిపిస్తున్నాయి. అలాగే వర్షాలకు ఎస్‌టీబీఎల్ వెనుక పలు వీధి దీపాలు కూడా వెలగడం లేదు. దీంతో విష పురుగుల సంచారం పెరిగి స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. వారం రోజులుగా ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. కూలిన చెట్లు, విరిగిన కొమ్మలు తొలగించి వెలగని విద్యుత్ దీపాలను పునరుద్ధరించాలని శ్రీనివాసనగర్ వాసులు కోరుతున్నారు.

కొండ నాలుకకు మందేస్తే..

- శిథిల కల్వర్ట్‌కు మరమ్మతు కోరితే రోడ్డును తవ్వేసిన వైనం
- 3 నెలలుగా ఏపీహెచ్‌బీ పరిసర ప్రాంతవాసుల అవస్థలు
- అదనంగా రెండు కిలోమీటర్ల ప్రయాణం



మధురవాడ ఆర్టీసీ డిపో వద్ద తవ్వి వదిలేసిన కల్వర్టు



రాకపోకలకు అవస్థలు పడుతున్న వాహన చోదకులు



రోడ్డుకు అడ్డంగా ఉన్న సిమెంట్ స్తంభాలు

మధురవాడ: కూటమి సర్కారు లెక్కే వేరు. గత సంక్రాంతి లోపు రోడ్లన్నీ అందంగా తయారు చేస్తామన్నారు. మరో సంక్రాంతి వచ్చేస్తున్నా రోడ్ల పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు. మధురవాడ ఆర్టీసీ డిపో పక్కనున్న ఏపీహెచ్‌బీ కాలనీ దుస్థితే అందుకు నిదర్శనం. ఇక్కడి మిథిలాపురి వుడా కాలనీ రోడ్డు నుంచి కాలనీ లోపలకి వెళ్లే దారిలో కల్వర్టు బ్లాక్ అయిపోయింది. దీంతో మురుగు నీరు తరచూ రోడ్డు పైకి వచ్చి దుర్వాసన వ్యాపిస్తోంది. రాకపోకలకు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత 8 నెలలుగా స్థానికులు అలాగే బాధపడుతున్నారు. దీనిపై ఫిర్యాదు చేసిన ప్రతిసారీ కల్వర్టుకు తాత్కాలిక మరమ్మతు చేస్తున్నారు. 2 నెలల క్రితం సమస్య పునరావృతం కావడంతో స్థానికులు జీవీఎంసీ అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేశారు. మురుగు నీటిని తరలించేందుకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూచనతో ఆ విభాగం కార్యదర్శి కల్వర్టు మొత్తం తవ్వించేశారు. దీంతో కల్వర్టు పరిధే కాకుండా రోడ్డు కూడా అస్తవ్యస్తంగా తయారయింది. రాకపోకలకు వీల్లేని పరిస్థితి ఏర్పడింది. కొత్తది నిర్మించాలని స్థానికులు అడిగితే నిధులు మంజూరు కాలేదని బదులిస్తున్నారు. దీంతో ఇక్కటి వీరి పరిస్థితి కొండ నాలుకకి మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్టు తయారైంది. మురుగు సమస్య కొంత తొలగినా రాకపోకలు బంద్ అయిపోయాయి. ఈ కాలనీతో పాటు పక్కనే ఉన్న కాలనీలకు చెందిన వందలాది మంది నిత్యం 2 కిలోమీటర్లు అదనంగా ప్రయాణం చేసి కూత వేటు దూరంలో ఉన్న ఆర్టీసీ డిపో రోడ్డుకు చేరుకోవాల్సి వస్తోంది. ఇక అత్యవసర పరిస్థితులు తలెత్తితే దేవుడే దిక్కు. ఇక్కడ కాలనీ వాసులు నెలల తరబడి ఇన్ని ఇబ్బందులు పడుతున్నా వార్డు కార్పొరేటర్, ఇతర ప్రజా ప్రతినిధులకు ఇక్కడి ప్రజల సమస్యలు ఏమాత్రం పట్టడం లేదని ప్రజలు వాపోతున్నారు.

వార్డుల పునర్విభజనతో సమస్యల ఉత్పన్నం..

ఈ ప్రాంతం భౌగోళికంగా మధురవాడలో ఉన్నా వార్డుల పునర్విభజన కారణంగా 8వ వార్డులోకి వెళ్లిపోయింది. ఈ వార్డు 90 శాతం సాగర్‌నగర్, యండాడ పరిసర ప్రాంతాల్లో ఉంది. ఈ కారణంగా కార్పొరేటర్ ఈ ప్రాంతంపై సీతకన్ను వేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు, కూటమి ప్రభుత్వ పెద్దలైనా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. లేకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..



ఈ విషయం మా దృష్టికి రాలేదు. తక్షణమే ఆ ప్రాంతాన్ని పరిశీలించి ప్రజల ఇబ్బందులు తెలుసుకుంటాం. సంబంధిత అధికారుల ద్వారా సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడతాం.

– కొట్యాడ కనక మహాలక్ష్మి, జోనల్ కమిషనర్, జోన్-2 మధురవాడ

ఉపాధ్యాయుని కుటుంబానికి రూ.50 వేల సాయం



వంకల స్రవంతికి రూ.50 వేలు అందిస్తున్న ఉపాధ్యాయులు

తగరపువలస : గత నెల 20న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎస్.రాయవరం మండలానికి చెందిన ఉపాధ్యాయుడు వంకల సత్యం భార్య స్రవంతికి ఆదివారం భీమిలికి చెందిన పీఆర్‌టీయూ సభ్యులు రూ.50వేల ఆర్థిక సాయం అందించారు. నగరంలోని ఆయన ఇంటి వద్ద ఈ మొత్తాన్ని అందించారు. గతంలో భీమిలి మండలం దిబ్బడిపాలెంలో పని చేసిన సత్యం ఇటీవల జరిగిన బదిలీల్లో ఎస్.రాయవరం మండలానికి బదిలీ అయ్యారని ఉపాధ్యాయులు తెలిపారు. ఆయన కుటుంబానికి పీఆర్‌టీయూ జిల్లా నాయకులు ఎం.శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, గరికిన పరదేశి, సన్యాసినాయుడు, రొంగలి అప్పారావు, ఆల్బర్ట్ సుదర్శన్, భీమిలి నాయకులు రెడ్డిపల్లి అప్పలరాజు, ఎస్.రమణారావు, ఎం.రమాదేవి, వెంకటరమణ ఆర్థిక సాయం చేశారు.

స్పీడ్ బ్రేకర్లు కాదు.. డ్రైనేజీలే

రోడ్డుకు అడ్డంగా నిర్మించడంతో ముందుకెళ్లని వాహనాలు



శింగనబంద పాఠశాల వద్ద డ్రైనేజీపై ఎత్తుగా మారి నిలిచిన వర్షపు నీరు



శింగనబంద గ్రామ సచివాలయం వద్ద రోడ్డుకు అడ్డంగా నిర్మించిన డ్రైనేజీ

తగరపువలస: ప్రపంచం సాంకేతికంగా రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్నా భీమిలి మండలంలోని ఇంజినీరింగ్ అధికారులు దానిని అందుకోలేకపోతున్నారని అక్కడి డ్రైనేజీల నిర్మాణం చూస్తే అర్థమవుతుంది. ఇటీవల వీళ్లు రహదారికి అడ్డంగా నిర్మించిన డ్రైనేజీలు చిన్న వాహనాల రాకపోకలకు ఆటంకంగా మారుతున్నాయి. డ్రైనేజీల నిర్మించక ముందు అన్ని రకాల వాహనాలు మండలంలోని లక్ష్మీపురం, శింగనబంద పంచాయతీల మీదుగా నారాయణరాజుపేట వరకు సులువుగా రాకపోకలు సాగించేవి. ప్రస్తుతం శింగనబంద సచివాలయం ఎదురుగా, శింగనబంద ప్రాథమిక పాఠశాల ఎదురుగా రోడ్డుకు అడ్డంగా నిర్మించిన డ్రైనేజీలు భారీ స్పీడ్ బ్రేకర్లను తలపిస్తున్నాయి. రెండు రోజులుగా ఈ మార్గంలో ఆటోలు, కార్లు వెళ్లలేక వెనక్కి మళ్లుతున్నాయి. ఒకవేళ అత్యవసరం అనిపించి ముందుకు వెళ్దామన్నా వాహనాల అడుగు భాగానికి డ్రైనేజీలు తగలడంతో మొరాయిస్తున్నాయి. ఈ డ్రైనేజీల నిర్మాణం జరుగుతున్న సమయంలో మూడు పంచాయతీల ప్రజలు అభ్యంతరం తెలిపినా.. టీడీపీకి చెందిన కాంట్రాక్టర్ వారిని హేళన చేసి మరీ అధ్వానంగా డ్రైనేజీలు నిర్మించాడు. దీంతో వాహనాల రాకపోకలకే కాకుండా వర్షపు నీటి ప్రవాహానికి కూడా ఇవి ఆటంకం కలిగిస్తున్నాయి. స్థానికుల ఇబ్బందులను గుర్తించి మండల ఇంజినీరింగ్ అధికారులు డ్రైనేజీల ఎత్తు తగ్గించి వాహనాలు సాఫీగా రాకపోకలు సాగించేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం



ర్యాలీ నిర్వహిస్తున్న కృష్ణాపురం కేజీబీవీ విద్యార్థినులు



ర్యాలీ నిర్వహిస్తున్న భీమిలి కేజీబీవీ విద్యార్థినులు

పద్మనాభం : సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా గర్ల్ చైల్డ్ డవలప్‌మెంట్ (జీసీడీవో) ఆఫీసర్ శ్రీదేవి అన్నారు. మండలంలోని కృష్ణాపురం కస్తూర్బా విద్యాలయంలో ఆదివారం సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎఫ్ఏ - 2 పరీక్షలకు సన్నద్ధం కావడంపై విద్యార్థినులకు పలు సూచనలు ఇచ్చారు. లెక్చరర్ సీహెచ్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ పాల్గొన్నారు.

భీమునిపట్నం : సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) ద్వారా ప్రభుత్వ సంస్థలు, విభాగాల నుంచి పౌరులు సమాచారాన్ని పొందే అవకాశం ఉందని సమగ్ర శిక్ష జీసీడీవో శ్రీదేవి అన్నారు. భీమిలిలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థినులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ చట్టం ద్వారా అవసరమైన పూర్తి సమాచారాన్ని పొందే అవకాశం ఉందన్నారు. అనంతరం విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించారు. ఎల్ఎస్‌వో శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ గంగా కుమారి పాల్గొన్నారు.

తగరపువలస : ఆనందపురం మండలం లొడగలవానిపాలెం పంచాయతీ నేలతేరు కేజీబీవీలో ఆదివారం సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. జీసీడీవో శ్రీదేవి, సమగ్ర శిక్ష అధ్యాపకుడు సీహెచ్ శ్రీనివాస్, షీల తదితరులు పాల్గొన్నారు.

ఎర్రయ్యమ్మకు ఘన నివాళి



జీరు ఎర్రయ్యమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మజ్జి శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు

తగరపువలస : వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ వలంటీర్ల సంఘం అధ్యక్షుడు జీరు వెంకటరెడ్డి మాతృమూర్తి ఎర్రయ్యమ్మకు ఆదివారం పార్టీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎర్రయ్యమ్మకు భీమిలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.జనార్దనరావు, వీఎంఆర్డీఏ మాజీ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, అక్కరమాని రామునాయుడు, అక్కరమాని మంగరాజు, రంగూరి రాంబాబు, బింగి హరికిరణ్‌రెడ్డి, శిల్లా కరుణాకరరెడ్డి, చిల్ల వెంకటరమణ, చింతగుంట శివ, అక్కరమాని చినబాబు, గుండాసి మధునాయుడు, నీలాపు శంకరరెడ్డి భీమిలి పట్టణ, రూరల్ వైఎస్సార్‌సీపీ నాయకులు నివాళులర్పించారు.

తీరం జనసంద్రం

కొమ్మాది : పర్యాటక ప్రాంతాల్లో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పర్యాటకుల సందడి కనిపించింది. గుడ్లవానిపాలెం బీచ్, సాగర్‌నగర్, రుషికొండ, తొట్లకొండ బీచ్, రామానాయుడు ఫిల్మ్ స్టూడియో, ఎర్రమట్టి దిబ్బలు, భీమిలి తీర ప్రాంతాల్లో పర్యాటకుల సందడి నెలకొంది. చిన్నారులు, పెద్దలు అన్న తేడా లేకుండా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు.

దళిత అధికారిపై దాడి గర్హనీయం



తాళ్లవలస సర్వీస్ రోడ్డులో రాస్తారోకో నిర్వహిస్తున్న మాల మహానాడు ప్రతినిధులు

తగరపువలస: ఇటీవల సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్‌పై దాడిని ఖండిస్తూ ఆదివారం మాల మహానాడు ఆధ్వర్యంలో భీమిలి మండలం తాళ్లవలస సర్వీస్ రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అధ్యక్షుడు భాగం గోపాలరావు మాట్లాడారు. దళితుడైన సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై సనాతన ధర్మం పేరుతో కిషోర్ అనే న్యాయవాది బూటుతో దాడికి పాల్పడటం అమానుషమన్నారు. అలాగే తెలుగు రాష్ట్రానికి చెందిన హర్యానా కేడర్ అదనపు డీజీపీ పురాన్ కుమార్‌పై అవినీతి ఆరోపణలు చేసి ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించిన పోలీస్ ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల హక్కులు కాపాడటంలో విఫలం అయ్యాయన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ బోని సన్నిబాబు, సియ్యాద్రి రాంబాబు, బెల్లాన అప్పారావు, బోని ప్రసాద్, బోని నరసింగరావు, యాగాటి రామారావు, మామిడి భాస్కరరావు, బోని శివ, మట్టా ఆదినారాయణ, లంక పైడిరాజు, బోని హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో మద్యం ప్రవాహం



వేములవలస కూడలిలో చిన్న దుకాణంలో మద్యం సేవిస్తున్న వ్యక్తులు



వేములవలసలో రహదారి పక్కన మద్యం సేవిస్తున్న వ్యక్తి

తగరపువలస: కూటమి ప్రభుత్వంలో మద్యం ఏరులై ప్రవహిస్తోంది. మద్యం దుకాణాలే కాకుండా ప్రతి పంచాయతీలోని 10 నుంచి 20 వరకు బెల్టుషాపులు తెరచి 24 గంటలూ మద్యం విక్రయిస్తున్నారు. క్వార్టర్ బాటిల్‌పై సమయాన్ని బట్టి రూ.20 నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని మందుబాబులు ఆరోపిస్తున్నారు. బెల్టుషాపులకు అడ్డుకట్ట వేసి కుటుంబాలను రక్షించాలని మహిళలు కోరుతున్నారు.

వెల్లంకి రైతు సేవా కేంద్రం మూతతో అన్నదాతల అవస్థలు

తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకి రైతు సేవా కేంద్రం కొంత కాలంగా మూతపడటంతో ఈ పంచాయతీ అన్నదాతలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీలో 70 శాతం మంది రైతులు వెల్లంకి, గారిపేట, బొడ్డపాలెం గ్రామాల్లో ఉన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ నడుస్తుండటంతో అవసరమైన సాగు సలహాలు, ఎరువులు ఇచ్చే నాథుడే కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. ఎప్పుడు చూసినా రైతుసేవా కేంద్రం తలుపులు మూసే ఉంటున్నాయని అంటున్నారు. దీనిపై అధికారులు తక్షణం చర్యలు తీసుకుని రైతు సేవా కేంద్రంలో సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల విజేత విశాఖ



కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులు

తగరపువలస : ఈ నెల 9 నుంచి 11 వరకు గంగవరంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పురుషుల ఆహ్వాన కబడ్డీ పోటీలు శనివారం రాత్రి ముగిసినట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి జీఎస్‌వీ ప్రసాదరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం చిట్టివలసలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ పోటీల్లో విన్నర్స్‌గా విశాఖ జిల్లా జట్టు రూ.50 వేల నగదు, ట్రోఫీ, రన్నర్స్‌గా తూర్పు గోదావరి జిల్లా జట్టు రూ.35 వేల నగదు, ట్రోఫీ గెలుచుకున్నాయన్నారు. మూడో స్థానంలో కృష్ణా జిల్లా జట్టు రూ.25 వేలు, నాలుగో స్థానంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ జట్టు రూ.15 వేలు గెలుచుకున్నాయన్నారు. రాష్ట్ర కబడ్డీ సంఘం అధ్యక్షుడు జి.వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, జీవీఎంసీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను, జిల్లా కబడ్డీ సంఘం సభ్యులు కారి లక్ష్మణరావు, కదిరి భూలోక, ఎం.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో పూర్వ విద్యార్థులు

మధురవాడ : చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1998 – 99 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం కొమ్మాది సమీపంలోని ఓ ప్రైవేటు రిసార్ట్‌లో కలుసుకున్నారు. పాఠశాల విద్య పూర్తయిన తర్వాత వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా 25 ఏళ్ల తర్వాత ఆత్మీయంగా కలుసుకుని పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని సరదాగా గడిపారు. 2020 నుంచి మైత్రి విన్నింగ్ హార్ట్స్ అసోసియేషన్‌ను స్థాపించి సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.

దేశభక్తి అలవరుచుకోవాలి

పద్మనాభం: దేశభక్తిని పెంపొందించడమే ఆర్ఎస్ఎస్ కర్తవ్యమని విభాగ్ ప్రచార్ ప్రముఖ్ నీలం రామకృష్ణ అన్నారు. ఆర్ఎస్ఎస్ ఏర్పడి వందేళ్లు పూర్తయిన సందర్భంగా పద్మనాభంలోని గోస్తని విద్యా పీఠ్‌లో ఆదివారం నిర్వహించిన దసరా ఉత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరు దేశభక్తి అలవరచు కోవాలన్నారు. సమాజంలో అంటరానితనం ఉండకూడదన్నారు. సాహిత్యం పుస్తక ప్రదర్శన ఆకట్టుకుంది. ఆర్ఎస్ఎస్ ప్రతినిధి కేశవ నాయుడు, కాళ్ల సూరిబాబు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు స్థలం కబ్జాకు యత్నం!



కబ్జా కోసం కూలగొట్టిన కమ్యూనిటీ హాలు స్థలంలోని ప్రహరీ



నిర్మాణానికి సిద్ధం చేసిన సామగ్రి

మధురవాడ: టీడీపీ నాయకులు, వారి అనుచరులు కబ్జాల్లో బిజీ అయిపోయారని విమర్శలు గుప్పుమంటున్నాయి. విశాఖ రూరల్ మండలం పరదేశిపాలెం రెవెన్యూ గ్రామంలో సుమారు రూ.30 లక్షలు విలువ చేసే కాలనీ కమ్యూనిటీ హాలు కోసం కేటాయించిన స్థలాన్ని ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నాలు ప్రారంభించారు. జీవీఎంసీ 5వ వార్డు బోరవానిపాలెం డ్రైవర్స్ కాలనీ పరదేశిపాలెం రెవెన్యూ గ్రామం సర్వే నంబరు.71/9లో సామాజిక అవసరాల కోసం 300 గజాల స్థలం ఉమ్మడిగా కొన్నేళ్ల క్రితం కేటాయించారు. అందులో సుమారు 150 గజాలు కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేసేశారు. ఇప్పుడు మిగిలి ఉన్న 150 గజాల స్థలం మీద కూడా వారి కన్ను పడింది. ఈ స్థలానికి చెందిన ప్రహరీ కూలగొట్టి వర్షానికి పడిపోయినట్టు స్థానికులను భ్రమింపజేసి ఆక్రమణకు తెరతీస్తున్నారు. వార్డు ముఖ్య నాయకుడి పేరు చెప్పి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేస్తున్నారు. కనీసం ఉన్నత స్థాయి అధికారులైనా స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా గౌరమ్మ నిమజ్జనం



నిమజ్జనానికి తీసుకువెళుతున్న గౌరమ్మ, నంది విగ్రహం

పద్మనాభం: శనివారం రాత్రి గౌరమ్మ నిమజ్జనం ఘనంగా జరిగింది. ఎన్నింటి వారి దేవుడింటిలో నిలిపిన గౌరమ్మ, మారు గౌరమ్మ ప్రతి రూపాలైన వరి దుబ్బులు, నంది విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి సచివాయం సమీపంలోని కొనేరులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా సాము గరిడి, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.